క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలాజీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన పోచయ్య కుటుంబ సభ్యులు గత రెండు రోజుల క్రితం ఊరికి వెళ్లారు. గురువారం ఇంటికి తిరిగి రాగా తాళం పగలగొట్టి కనిపించింది. బీరువాలో ఉన్న రూ.15వేల నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించారు. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఎస్పీలో చేరిక



సత్తన్నకు కండువా కప్పుతున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొలాజి సత్తన్న గురువారం బీఎస్పీలో చేరారు. మండల కేంద్రంలో బీఎస్పీ ఉత్తర తెలంగాణ చేరికల కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం మోతిరాం, బెజ్జూర్ సర్పంచ్ అన్సార్ హుస్సేన్, సారయ్య, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న కాలనీవాసులు

కౌటాల: మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీలో కమీషన్ల కోసమే రోడ్డు వేస్తున్నారని కాలనీవాసులు గురువారం సీసీ రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది వరకే ఉన్న సీసీ రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు వేయడం ఏమిటని ప్రశ్నించారు. రోడ్డు పనుల్లో ఏ మాత్రం నాణ్యత లేదని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రోడ్లు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. రోడ్డు లేని చోట రోడ్డు వేయాలని, మాకు సీసీ రోడ్డు వద్దని.. డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రోడ్డును ధ్వంసం చేశారు.

108లో ప్రసవం



బిడ్డతో కుటుంబీకులు, 108 సిబ్బంది

దహెగాం: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన గర్భిణి కొడిపె రాణి గురువారం తెల్లవారుజాము పురిటి నొప్పులు రాగా 108లో దహెగాం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమెకు బీపీ తక్కువగా ఉందని బెల్లంపల్లికి రెఫర్ చేశారు. 108లో తరలిస్తుండగా బెల్లంపల్లి సమీపంలో మార్గమధ్యలో ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని ఈఎంటీ బుర్రి సుధాకర్, పైలట్ శ్రావణ్ తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని పేర్కొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కౌటాల: మండల కేంద్రంతోపాటు విజయనగరం, యాపలగూడ గ్రామాల్లో క్యాథోలిక్ చర్చి క్రైస్తవులు సమాధుల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఏటా గ్రామంలో సమాధుల పండుగ జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు సీజో, సతీశ్, టోమ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రెబ్బెన: మండలంలోని గోలేటి వారసంతలో గురువారం గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం వారసంతలో సరుకులు, కూరగాయలు విక్రయించేందుకు వచ్చే వ్యాపారులు, రైతుల ఆకలిని తీర్చేందుకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సభ్యులు వసీం, మోతఉజ్, భరత్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం

- గిరిజన గ్రామం లైన్‌పటార్
- కనీస వసతులు, రోడ్లు లేవు
- ఇక్కట్లు పడుతున్న గిరిజనులు



అధ్వానంగా ఉన్న రోడ్డు



ఇదే లైన్‌పటార్ గ్రామం

కెరమెరి: దశాబ్దాలుగా ఆ గిరి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కనీస వసతులు కానరావడం లేదు. రోడ్లు, రవాణా సదుపాయం, పక్కా ఇళ్లు లేకుండా పోయాయి. ప్రభుత్వాల హయాంలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చినా గిరిజనులు ఇప్పటికి పెంకుటిళ్లలోనే కాలం గడుపుతున్నారు. అయినా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రాళ్లు, రప్పల దారే వారికి దిక్కయింది. ఇదీ కెరమెరి మండలంలోని లైన్‌పటార్ గ్రామ దుస్థితి. గ్రామంలో 20 కుటుంబాలున్నాయి. అందులో 113 జనాభా ఉంది. అక్కడ ఉన్న వారందరూ కొలాంల ఆదివాసీ తెగకు చెందిన వారు. జోడేఘాట్‌కు వెళ్లేదారిలో ఉన్న టోకెన్ మోవాడ్ నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న ఆ గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. ఏళ్లు గడుస్తున్నా రహదారి సౌకర్యం లేదు. బండరాళ్లు రప్పలు తేలి నడిచేందుకు ఎంతో కష్టమవుతోంది. అయినా మరమ్మతు చేద్దామన్నా చిత్తశుద్ధి అధికారుల్లో లేకపోవడం గమనార్హం. వేసవి, చలికాలం ఎలాగైన గడుస్తున్నా వర్షాకాలంలో మాత్రం వారి బాధలు వర్ణనాతీతం. దారి మధ్యలో చిన్న చెరువుంది. అది నిండుకుండలా ప్రవహిస్తే ఇక ఎటూ వెళ్లలేని పరిస్థితి. చేతిపంపు కూడా ఒకటే ఏండడంతో కష్టం తప్పడం లేదు.

అంగన్‌వాడీ, పాఠశాల లేదు

ఆ గ్రామంలో కొందరు చిన్నారుల చదువులకు దూరంగా ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో ఖాళీగా ఉంటున్నారు. కొందరు తల్లిదండ్రుల వెంట పొలాలకు వెళ్తుంటే, మరికొందరు ఇళ్లలోనే ఉంచుతున్నారు. ఇంకొందరు ఆశ్రమ పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ఉన్న కొందరు చదువుకు దూరమవుతున్నారు. అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు అందే పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. దీంతో రకరకాల వ్యాధులు సంభవించే ప్రమాదం నెలకొంది. గ్రామంలో ఒకటే చేతిపంపు ఉంది. వేసవికాలంలో తిప్పలు తప్పవు. ఐదు నెలల క్రితం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. ఆయా అప్పుడప్పుడు వస్తున్నా. టీచర్, అంగన్‌వాడీ కేంద్రం ఉంటే సమస్య తీరిపోయేది. గ్రామంలో చిన్నారులు 20 మంది ఉన్నారు.

– ఆత్రం భీము, గ్రామస్తుడు

రోడ్డు నిర్మించాలి



రోడ్డు సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం రాళ్లు, రప్పలు తేలి నడిచేందుకు యోగ్యంగా లేదు. వానాకాలంలో చెరువులు నిండిపోతాయి. బోరింగ్ కూడా ఒక్కటే ఉంది. అధికారులు నీటి సౌకర్యం కల్పించాలి.

– ఆత్రం అయ్యూబాయి

'యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలు'



డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతో యువతను మోసం చేస్తున్నాయని డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం అన్నారు. మండలంలోని రాంపూర్‌లో డీవైఎఫ్ఐ జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీని మరిచిందన్నారు. మండల సహాయ కార్యదర్శులు శివ, శ్రావణి, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి వంశీ, కార్తీక్, మండల నాయకులు హరీశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'సీస్'ను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వే పనుల్లో కోఆర్డినేటర్లు, ఇన్విజిలేటర్లు

కెరమెరి: మండలంలోని మొత్తం 99 ప్రభుత్వ, ప్రైవేటు, సంక్షేమ పాఠశాలలు ఉండగా 33 పాఠశాలల్లో కొనసాగే సీస్(స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే)ను పకడ్బందీగా నిర్వహించాలని కోఆర్డినేటర్లు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఐటీడీఏ ఉన్నత 4, ఉన్నత 4, ప్రాథమికోన్నత 4, ట్రైబల్‌వెల్ఫేర్ ప్రాథమిక 1, కెజీబీవీ 1, ఉన్నత పాఠశాల ఉర్దూమీడియం 1, 18 ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సీస్ సర్వే పరీక్ష కొనసాగుతుందన్నారు. 3,6,9వ తరగతులకు చెందిన 694 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి సర్వే ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



పిండిగిర్నీని పరిశీలిస్తున్న డీపీఎం, ఎల్‌డీఎం

కెరమెరి: పీఎంఎఫ్‌ఎంఈలో భాగంగా మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ డీపీఎం సారయ్య, ఎల్‌డీఎం కోవ హన్మంత్‌రావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన సమీనాబి ఇటీవల పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద రూ. లక్ష రుణంతో పిండిగిర్నీ ఏర్పాటు చేసుకుంది. గురువారం పిండిగిర్నీని వారు పరిశీలించారు. వచ్చే ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాయితీ పోను మిగిలిన రూ.70 వేలను నెలవారీ చొప్పున ప్రతి నెల చెల్లించాలన్నారు. ఏపీఎం జగదీశ్వర్, సీసీ శంకర్ ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి'



భోలాపటార్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



దహెగాం: ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

కెరమెరి: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. మండలంలోని అంతాపూర్, భోలాపటార్, పరంధోళి పంచాయతీలోని వివిధ గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీటీసీ సకారాం, సర్పంచులు జగన్నాథ్‌రావు, నారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, నాయకులు కేంద్రె బాలాజీ, సిరాజ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దహెగాం: మండలంలోని బ్రహ్మన్‌చిచ్యాల గ్రామంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు కోనేరు ఫణి, దందెర వెంకన్న, తదితరులు ఉన్నారు.

రెబ్బెన: మండలంలోని వర్ధలగూడ, పోతపెల్లి, పాశిగాం, మాద్యాయిగూడ గ్రామాల్లో గురువారం గడప గడపకూ బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, ఎంపీటీసీ మధునయ్య, సర్పంచ్ సోమశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, నాయకులు ఆనంద్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

జైనూర్: బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా అన్నారు. మండలంలోని దుబ్బగూడ, భీంజిగూడ, ముక్కెరగూడ, భూసిమెట్ట గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, నాయకులు మెస్రం అంబాజీ, జన్నావార్ పవన్, ముడే సతీశ్, పెందూర్ మోహన్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.



రెబ్బెన: ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు



జైనూర్: దుబ్బగూడలో..

చకచకా రోడ్డు పనులు



బెజ్జూర్: మండల కేంద్రం నుంచి ఎలుకపెల్లి మీదుగా సిద్దాపూర్ వరకు గతనెలలో బీటీ రోడ్డు మంజూరైంది. రూ.1.50 కోట్లతో చేపట్టిన పనులు చకచకాగా సాగుతోంది. గతంలో ఎలుకపెల్లి, చిన్నసిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్ గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుండేవారు. గ్రామాలకు మట్టి రోడ్డే ఉండడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో వారి బాధలు వర్ణనాతీతం. బైక్‌లు, ఎడ్లబండ్లు ముందుకు వెళ్లలేక బురదలో దిగబడ్డ ఘటనలు కోకొల్లలు. గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చొరవతోనే బీటీ రోడ్డు మంజూరైంది. వెంటనే పనులు చేపట్టడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొన్న రవాణా కష్టాలు దూరమయ్యాయని పేర్కొంటున్నారు.

మహాసభకు తరలిరండి

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నవంబర్ 11న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర సీనియర్ నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ, దాసరి రాంప్రసాద్‌లు కోరారు. గురువారం మండలంలోని హస్నాపూర్‌లో సభ పోస్టర్ ఆవిష్కరించారు. పరుశురాం, దీపక్, గైక్వాడ్ వినోద్, సతీశ్, దయానంద్ పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ముందుండాలి



అవగాహన కల్పిస్తున్న రాణి

ఆసిఫాబాద్‌రూరల్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ రాణి అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గిరిజన జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న సమాజంలో తల్లిదండ్రులు బాలికలకు ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

నార్నూర్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్ అన్నారు. గురువారం మండలంలోని గుండాల తండా, గొండుగూడ, ఎస్సీగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. అభివృద్ధి, సంక్షేమానికే ప్రజలు ఓటు వేస్తారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, సయ్యద్‌ఖాశీం, రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.

సూరు వర్ధంతి విజయవంతం చేయండి

ఉట్నూర్‌రూరల్: కుమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని సూరు వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్ మడావి రాజేశ్వర్ కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈనెల 4న ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి కోలాంగూడలో వర్ధంతి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా ఎస్పీ, ఉట్నూర్ డీఎస్పీలు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిడాం ధర్ము, కన్వీనర్ కుమ్ర రాజు, కొడప బాపురావు, ఆత్రం ముకుంద్‌రావు, కొడప నగేశ్, ఆత్రం భీంరావు, కొడప జంగు పాల్గొన్నారు.

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బేల: ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే కోరారు. గురువారం మండలంలోని మణియార్‌పూర్, మాంగ్రుడ్ గ్రామాల్లో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సలహాలు, సేవల కోసం ప్రజలు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రతీ ఉద్యోగి లక్ష్య సాధనకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ వివరాలు ఆన్‌లైన్ నమోదులో వెనుకబడ్డ వెల్‌నెస్ కేంద్రాల వివరాలు వెల్లడిస్తూ పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. బీపీ, మధుమేహ బాధితులను గుర్తించి మందులు అందేలా చూడాలన్నారు. గర్భిణుల నమోదు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, టీకాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ అధికారి శ్రీధర్, ఎన్‌హెచ్‌ఎం అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజనుల కోసం పోరాటం చేశాం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కౌటాలలో ఆదివాసీలతో సమావేశం



ఎమ్మెల్యే కోనప్పకు సంఘీభావం తెలుపుతున్న గిరిజన నాయకులు

కౌటాల: సిర్పూర్ నియోజకవర్గంలోని ఆదివాసీల పోడు భూముల కోసం కోనేరు కుటుంబం పోరాటం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మన్నెవార్ సేవా సంఘం భవనంలో గురువారం మన్నెవార్, కొలవార్ల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతుల కోసం ప్రభుత్వం గిరివికాస్ పథకంలో విద్యుత్ సౌకర్యం, సాగునీటి సౌకర్యం కల్పించమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సిర్పూర్‌లోని గిరిజన రైతులకు పోడుపట్టాలు అందించామని తెలిపారు. అత్యధికంగా ఆదివాసీలకు గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.60 లక్షల నిధులతో అన్ని మండలాల్లో ఆదివాసీ భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. జనంతోనే ఉండి సమస్యలు పరిష్కరిస్తామని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మన్నెవార్, కొలవార్లు ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్పకు సంపూర్ణ సంఘీభావం తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మండలంలోని ఆయా గ్రామాల నుంచి పలువురు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ బి.విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, మన్నెవార్ సేవా సంఘం జిల్లా మెర్పల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర నాయకులు పి.పోశం, సదాశివ్, భీమయ్య, పార్టీ నాయకులు వసంత్‌రావు, మధుకర్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకే కార్డన్‌సెర్చ్

- ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

వాంకిడి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకే కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని ధాబా గ్రామంలో గురువారం పారా మిలిటరీ బృందం, పోలీసులు కార్డన్‌సెర్చ్, మార్చ్‌ఫ్లాగ్ నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లలో తనిఖీ నిర్వహించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైన కొత్త వ్యక్తులు గ్రామంలో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి సహకరించవద్దన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మండువా గ్రామంలో గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటేయాలన్నారు. గ్రామంలో గుడుంబా, బెల్టుషాపుల నిర్వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై రామన్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పట్టాలు మార్పిడి చేస్తున్న భూ కబ్జాదారులు'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: అమాయక ప్రజలను ఆసరా చేసుకుని భూ కబ్జాదారులు పట్టాలు మార్పిడి చేస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరులతో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రజలను కొందరు కబ్జాదారులు ఆసరా చేసుకుని పట్టాలు మార్పిడి చేస్తూ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు కొంత నగదు ఇచ్చి భూమి ఉన్నవారి పేరు మీద పట్టాలు చేసుకుని మోసం చేస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టికనంద్, నాయకులు పురుషోత్తం, శ్రీకాంత్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.